## రైలు నుంచి పడి ఒకరి మృతి

కేసముద్రం : మండలంలోని తాళ్లపూస పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు జీఆర్పీ ఐవో ఐలయ్య సోమవారం తెలిపారు. బీహార్ రాష్ట్రం గయలోని అకంబా ప్రాంతానికి చెందిన పరంహానస్ (53) చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో గయా నుంచి చెన్నై వెళ్తున్నాడు. కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య 430 /18–20 కిలో మీటర్ రాయి వద్ద ప్రమాదవశాత్తు జారి రైలు నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో ఐలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 2: మండలలోని పాలెం, పాత్రాపురం, వీరభద్రవరం గ్రామ శివారుల్లో సోమవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య వేదిక పేరుతో కరపత్రాలు వెలిశాయి. 'మా కొద్దు మావోయిస్టు పార్టీ, మా బతుకు మమ్మల్ని బతకనివ్వండి, మావోయిస్టు పార్టీ ఆదివాసీల అభివృద్ధి కోసం చేసింది ఏమిటి? అమాయక అదివాసీ యువతను పార్టీ భావజాలానికి ఆకర్షితులను చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారు' అని అందులో రాసిఉంది.

## చిరు వ్యాపారులపై
# కమర్షియల్ బండ

- ఒక్కో సిలిండర్‌పై రూ.203.50 వడ్డన
- ప్రతి నెలా పెరుగుతున్న 19 కిలోల గ్యాస్ ధర
- టీ కొట్టు నుంచి మొదలుకొని భోజన హోటళ్ల వరకు తీవ్ర ప్రభావం
- కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు
- జిల్లాలో ప్రతినెలా 3,687 కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా
- వినియోగదారులపై నెలకు రూ.7.50 లక్షల భారం




మహబూబాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సామాన్యుడు బతకలేని పరిస్థితిని తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను పెంచి పేదల ప్రజలపై పెనుభారం మోపుతున్నది. ఇటీవల 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కాస్త తగ్గించడంతో చిరువ్యాపారులు సంబురడ్డా.. ఇప్పుడు ఏకంగా రూ.203.50 పెంచడంతో చిరువ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. ధరల పెంపు ఫలితంగా టీ కొట్టు దగ్గరి నుంచి మొదలుకొని భోజన హోటళ్ల వరకు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఆ ప్రభావం సామాన్య ప్రజలపై పడుతున్నది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడం, తగ్గించడం పూర్తిగా కేంద్రం ఆధీనంలో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఏర్పడకుండా నెలనెలా ధరలు పెంచుతూ భారం మోపుతున్నది. గత నెల 30వ తేదీ వరకు 19 కిలోల కమర్షియల్ గ్యాస్ ధర రూ.1,788.50 ఉండగా, ఈ నెల ఒకటి నుంచి రూ.1992కు చేరింది. అంటే ఒక్కో కమర్షియల్ సిలిండర్‌పై రూ.203.50కు పెంచింది. ప్రస్తుతం కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధర రూ.1,788.50 నుంచి రూ.1,992కు పెరగడంతో చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసరాల సరుకుల ధరలు ఇప్పటికే ఆకాశన్నంటడంతో సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు. వీటికి తోడు గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలు కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెరిగి ఇళ్లు గడవడమే కష్టంగా మారిందని, నెలనెలా గ్యాస్ ధరలు పెంచడంతో బతకడం కష్టంగా మారిందని మండిపడుతున్నారు. జిల్లాలో 13 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇండేన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ)7, హిందుస్థాన్ పెట్రోలియం(హెచ్‌పీసీ) 03, భారత్ పెట్రోలియం(బీపీసీ) 03 మొత్తం 13 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 1,229 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 3,687 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. ఈ లెక్కన ఒక్కో సిలిండర్‌కు రూ.203.50 చొప్పున నెలకు రూ.7.50 లక్షలు వినియోగదారులపై భారం పడుతున్నది. ప్రతి నెలా కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడంతో ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతున్నది.

### గిట్టుబాటు కావడం లేదు



మహబూబాబాద్ పట్టణంలో చిన్న టీ స్టాల్ పెట్టుకున్నాను. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ ధర రూ.1,788.50 ఉన్నప్పుడు రూ.7కు ఒక టీ అమ్మాను. ఇప్పుడు 19 కిలోలగ్యాస్ ధర రూ.1,992లకు చేరింది. ఒక్క సిలిండర్‌పై రూ.203.50 పెరిగినా టీ ధర రూ.7కే అమ్ముతున్నాను. కూలి గిట్టుబాటు కావడం లేదు. చిన్నా చితక వ్యాపారం చేసుకొని బతికేవాళ్లం. ఇలా వరుసగా గ్యాస్ ధర పెరిగితే ఎలా బతకాలి. కేంద్రం గ్యాస్ ధర పెంచిందని, మేము టీ ధర పెంచితే గిరాకీ ఉండడం లేదు. ధర పెంచకుంటే గిట్టుబాటు కావడం లేదు. వంటింట్లో ఉపయోగించే 14 కిలోల గ్యాస్ సిలిండర్ వినియోగిస్తామంటే అధికారులు పట్టుకొని చట్టం 6(ఏ) కింద కేసు నమోదు చేస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ వినియోగిస్తే గిట్టుబాటు కావడం లేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరను వెంటనే తగ్గించాలి.

–భూపతి ఆంజనేయులు, టీ స్టాల్ నిర్వాహకుడు

## కేసముద్రంలో ఆగని 'షిర్డీ'

కేసముద్రం, అక్టోబర్ 2: కేసముద్రం రైల్వే స్టేషన్‌లో సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఆగలేదు. స్థానికుల కథనం ప్రకారం.. సాయినగర్ షిరిడీ, పద్మావతి రైళ్లకు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వడంతో స్థానిక ప్రయాణికులకు ప్రయాణం సులువుగా మారింది. కాగా, ఆ రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కేసముద్రం రైల్వే స్టేషన్ ద్వారా ఆదాయం లేదని గత కొన్ని రోజుల నుంచి అధికారులు హాల్టింగ్‌ను రద్దు చేశారు. దీంతో రెండు రైళ్లు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ఆగడం లేదు. అయితే ఓ ప్రైవేట్ యాప్‌లో మళ్లీ సాయినగర్ షిరిడీ, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కేసముద్రంలో తిరిగి హాల్టింగ్ ఇచ్చినట్లు చూపించింది. దీంతో కొంత మంది ప్రయాణికులు విజయవాడ వైపు వెళ్లేందుకు సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ ఎక్కగా, కేసముద్రంలో హాల్టింగ్ ఇవ్వకపోవడంతో మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి కేసముద్రానికి వచ్చారు. వరంగల్ వైపు వెళ్లే సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలులోనూ కేసముద్రం రైల్వే స్టేషన్‌లో దిగడానికి కొంతమంది ప్రయాణికులు ఎక్కారు. రైలు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ఆగకుండా వెళ్లడంతో ప్రయాణికులు అరిచారు. గమనించిన డ్రైవర్ ప్లాట్‌ఫాం నుంచి రైలు కొంత దూరం వెళ్లిన తర్వాత నిలిపివేసినట్లు సమాచారం.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోర్నకల్, అక్టోబర్ 2: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం పాత డోర్నకల్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి...అమ్మపాలెం గ్రామానికి చెందిన గాదె నవీన్ (33) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అతడు కత్తిపోట్లతో రక్తపు మడుగులో ఉన్నట్లు గమనించిన స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. నవీన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

## శాంతియుత మార్గం సదా అనుసరణీయం

- అహింసా మార్గంలోనే గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు
- బాపూజీ స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ సాధించారు
- రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- జాతిపిత అడుగు జాడల్లో నడుద్దాం
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- పబ్లిక్‌గార్డెన్‌లో గాంధీజీ విగ్రహం వద్ద నివాళి


పబ్లిక్‌గార్డెన్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, చీఫ్‌విప్ దాస్యం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : సత్యం, అహింస మార్గంలో బ్రిటిష్ వారి నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు గాంధీ అని, ఆయన చూపిన మార్గం సదా అనుసరణీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గాంధీ మార్గంలోనే స్వరాష్ట్రం సాధించి, వలసలు తగ్గించిన మహనీయుడు మన సీఎం కేసీఆర్ అని అన్నారు. దేశానికి గాంధీజీ స్వాతంత్ర్యం తెస్తే, మన రాష్ట్రానికి కేసీఆర్ స్వాతంత్ర్యాన్ని తెచ్చారన్నారు. గాంధీ కలలను సాకారం చేసిం ది సీఎం కేసీఆరే అని అన్నారు. గాంధీ ఎప్పుడూ గ్రామా లు అభివృద్ధి చెందాలని కోరుకునేవారని, వలసలు తగ్గినప్పుడే గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆ మాటలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామాన్ని కడిగిన ముత్యంలా తయారు చేశామన్నారు. మన గ్రామాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దామని, స్వచ్ఛభారత్‌లో మన రాష్ట్రమే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆదర్శ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తే మన రాష్ట్రమే నంబర్ వన్ స్థానంలో ఉం టుందన్నారు. దేశంలో సంపూర్ణ ఓడీఎఫ్ రాష్ట్రం కూడా మన తెలంగాణనేనని అన్నారు. ఇవేగాక రైతులకు నూతన రెవెన్యూ చట్టం, రైతు బంధు, రైతు బీమా లాం టి పథకాలు అందజేసి, వారి కష్టాలు తీరుస్తున్నారన్నారు.

## వెదురు కర్రలు స్వాధీనం

కొత్తగూడ, అక్టోబర్ 2 : డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న వెదురు కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు సెక్షన్ ఆఫీసర్ రాజేశ్ తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ కథనం ప్రకారం.. కొత్తగూడ మండలం ముస్మీ గ్రామం నుంచి డీసీఎం వాహనంలో అక్రమంగా వెదురు కర్రలు తరలిస్తున్నారన్న పక్కాసమాచారం మేరకు అటవీశాఖ అధికారులు దాడులు చేశారు. కర్రలతో సహా వాహనాన్ని స్వాధీనం చేసుకొని కొత్తగూడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. కర్ర విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని సెక్షన్ ఆఫీసర్ తెలిపారు. ఈ దాడుల్లో అటవీ శాఖ సిబ్బంది బంగారు నితన్, మోహన్, సతీశ్‌వర్మ పాల్గొన్నారు.

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

దంతాలపల్లి, అక్టోబర్ 2: మండలంలోని తూర్పుతండా నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేశ్‌బాబు సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తూర్పుతండాలోని కొంతమంది రేషన్ డీలర్లతో చేతులు కలిపి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. టాటా ఏస్ వాహనం, బైక్‌ను సీజ్ చేసి 30 క్వింటాళ్ల స్వాధీనం చేసుకొని కొడకండ్ల మండలం, దంతాలపల్లి మండలానికి చెందిన నవీన్, సురేశ్, రాజేశ్, వెంకటేశ్, సురేశ్, ఐలయ్య, సంతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై తారసింగ్, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్‌రెడ్డి, జెన్నయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SAMBARI SAAI PRANAVI, D/o. SAMBARI PRAVEEN KUMAR (New Name), previously called SAMBARI BHANUSRI, D/o. SAMBARI PRAVEEN KUMAR (Old Name), and residing at H.No. 35-6-644, Amaravathi Nagar, Gopalpur, Hanamkonda, Hanumakonda District, Telangana State, India. and solemnly declare.

WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565